
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 24 । ఆగస్టు । 2023

I



సోమశిలలో 19.28 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 19.285 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 582 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,419
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,582
నవర (8 గ్రాములు)	రూ.44,656

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /27.7

గాలిలో తేమ 47 శాతంగా ఉంది. జిల్లాలో ఎండ తీవ్రత గురువారం అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి సీఎం, స్వాతంత్య్ర సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో పయనించాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఏఓ షఫీమాలిక్ పాల్గొన్నారు.

ప్లాంటేషన్లలో విజిలెన్స్ డీఎఫ్‌ఓ తనిఖీలు



ఉదయగిరి: కంపా పథకం ద్వారా ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్లు, నర్సరీలను రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్ఓ రవిశంకర్‌శర్మ బుధవారం తనిఖీ చేశారు. ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని బండగానిపల్లి, దుర్గంపల్లి, నర్రవాడ, ఏరుకొల్లులో ప్లాంటేషన్లు, నర్సరీలను పరిశీలించి అందులో పెంచుతున్న మొక్కల వివరాలను ఆరాతీశారు. మొక్కలు ఏ మేర పెరిగాయనే అంశమై కొలతలు సేకరించారు. ప్లాంటేషన్లు, నర్సరీలను సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, విజిలెన్స్ రేంజ్ అధికారి శంకరయ్య, డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు, ఎఫ్బీఓలు లక్ష్మీప్రసన్న, ఓంప్రకాష్, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల జాబితా రూపొందించండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీఆర్వో

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో అసైన్డ్ భూములు కలిగిన రైతులకు పట్టా హక్కులు కల్పించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి జాబితాలను రూపొందించాలని సీసీఎల్ఏ అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం ఆయన నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి డీఆర్వో వెంకటనారాయణమ్మ హాజరయ్యారు. 2003 వరకు ఇచ్చిన అసైన్‌మెంట్, ఇనామ్ భూములకు సంబంధించిన జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. అసైన్‌మెంట్ కమిటీకి సంబంధించిన తాజా లబ్ధిదారుల వివరాలను వీఆర్వో యాప్‌లో సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ కమిటీ పొందుపర్చిన లబ్ధిదారులకు పట్టాలను వీలైనంత త్వరలో అందజేయనున్నామని వెల్లడించారు.

వేదగిరిలో సీనియర్ సివిల్ జడ్జి పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సీనియర్ సివిల్ జడ్జి వాణి, కుటుంబసభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల దాడులు

చేజర్ల: మండలంలోని ఎర్రబెల్లి సమీపాన జిల్లా విజిలెన్స్ మైనింగ్ స్క్వాడ్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో దాడులను మంగళవారం రాత్రి చేపట్టారు. ఎర్రబెల్లి సమీపంలో తెల్లరాయిని అక్రమంగా తీస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆడుతా.. హాయిగా



- ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'
- గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు
- ఐదు క్రీడాంశాల్లో 46 రోజుల పాటు ఉత్సవాలు
- ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్‌లో పోటీల నిర్వహణ

గ్రామీణ స్థాయి నుంచే క్రీడా కుసుమాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 17 ఏళ్లలోపు వారిలో క్రీడాసక్తిని పెంపొందించి వారిని భవిష్యత్తు క్రీడాకారులుగా సిద్ధం చేసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు రకాల పోటీలను అక్టోబర్ రెండు నుంచి 46 రోజుల పాటు తలమానికంగా జరపనున్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రతిభ ఉండి.. సరైన ప్రోత్సాహం లేక అనేక మంది ఇప్పటి వరకు క్రీడా వేదికల్లో పాల్గొనలేకపోయారు. వీరి పాలిట వరంగా నిలిచి.. భవిష్యత్తు క్రీడాకారులుగా తయారు చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని 17 ఏళ్లలోపు వారిలో క్రీడాసక్తిని మరింత పెంచి.. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు గానూ 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడోత్సవాలకు శ్రీకారం చుడుతున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ రెండు నుంచి 46 రోజుల పాటు గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు రకాల పోటీలను నిర్వహించనున్నారు.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

సన్నాహాలు షురూ..

క్రీడా సంబరాలకు సంబంధించిన ప్రణాళికను కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిద్ధం చేస్తోంది. ఆడుదాం ఆంధ్రాను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే సన్నాహాలను ప్రారంభించింది. పోటీలను తలమానికంగా జరిపేందుకు క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల్లో పోటీలను నిర్వహించనున్నారు. తొలుత సచివాలయ.. ఆపై మండల.. అనంతరం నియోజకవర్గ.. జిల్లా.. రాష్ట్ర స్థాయిలో పోటీలను జరపనున్నారు. పోటీలకు ముందే గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. బాలబాలికలకు క్రీడా పరికరాలనూ అందజేయనున్నారు. గ్రామ స్థాయిలో యువజన సంఘాలు భాగస్వాములయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి క్రీడా ప్రాధాన్యంపై అవగాహన కల్పించి.. గ్రామీణ యువత పోటీల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టనున్నారు.

జిల్లాలో ఇలా..

గ్రామ సచివాలయ జట్లు - 549	వార్డు సచివాలయ జట్లు - 219
భాగస్వామ్యం కానున్న వారు - 325 మంది పీడీలు, పీఈటీలు	

కోచ్‌ల భాగస్వామ్యం

జిల్లాలోని దాదాపు 549 గ్రామ సచివాలయాల నుంచి జట్లు, వార్డు సచివాలయాలకు సంబంధించిన 219 జట్లు పోటీల్లో పాల్గొననున్నాయి. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు దాదాపు 325 మంది పీడీలు, పీఈటీలతో పాటు జిల్లా క్రీడాప్రాధికార సంస్థకు చెందిన కోచ్‌లు భాగస్వాములు కానున్నారు.

క్రీడాంశాలు..



బ్యాడ్మింటన్‌లో హోరాహోరీగా తలపడుతూ.. (ఫైల్)

జిల్లాలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్‌లో పోటీలను నిర్వహించనున్నారు. 17 ఏళ్లలోపు వారే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఒక్కో క్రీడాకారుడు రెండు క్రీడాంశాల్లో పాల్గొనవచ్చు. నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించనున్నారు. బాలబాలికలకు పోటీలను వేర్వేరుగా జరపనున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి.. నియోజకవర్గ.. జిల్లా స్థాయి వరకు జిల్లాలోని వివిధ ప్రభుత్వాధికారుల నేతృత్వంలో క్రీడాప్రాధికార సంస్థ పోటీలను నిర్వహించనుంది.

క్రీడాకారులకు మంచి అవకాశం



క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ఈ కార్యక్రమం క్రీడాకారులకు మంచి అవకాశం. క్రీడలపై గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు మరింత ఆసక్తిని పెంచుకునేందుకు ఇది దోహదపడుతుంది. మైదానాలు, ఆటలు, క్రీడాకారుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నాం. పోటీలను పకడ్బందీగా నిర్వహించనున్నాం. – యతిరాజ్, డీఎస్‌డీఓ, చీఫ్ కోచ్

సలామ్.. ఇస్రో

ఎప్పుడెప్పుడా అని దేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అపురూప ఘట్టం బుధవారం ఆవిష్కృతమైంది. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ – 3 ల్యాండర్ జాబిల్లిపై దిగ్విజయంగా అడుగిడిన తరుణంలో జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇస్రో శాస్త్రవేత్తలకు పలువురు ప్రముఖులు అభినందనలను తెలియజేశారు.



రాకెట్ ఆకారంలో..

అనుమసముద్రంపేట: చంద్రయాన్ – 3 రోవర్ చంద్రుడిపై విజయవంతంగా ల్యాండైన తరుణంలో ఏఎస్‌పేటలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు రాకెట్ ఆకారంలో ఏర్పడ్డారు. జై హింద్ అంటూ నినాదాలు చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అద్భుత ఘట్టం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): చంద్రయాన్ విజయవంతంతో దేశ కీర్తి ప్రతిష్ట అత్యున్నత శిఖరానికి చేరిందని, ఈ అద్భుత ఘట్టాన్ని దేశ ప్రజలు ఆస్వాదించాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రయాన్ – 3 రోవర్ ల్యాండింగ్ కార్యక్రమాన్ని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో బుధవారం వీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహోన్నత ఘట్టం తనకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలను తెలియజేశారు.

శాస్త్రవేత్తలకు అభినందనలు

నెల్లూరు రూరల్: చంద్రయాన్ – 3 విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. జాబిల్లి రహస్యాలను మానవాళికి అందించే అద్భుత కార్యం ఆవిష్కృతమైందని ఆయన చెప్పారు.



కార్యక్రమాన్ని టీవీలో వీక్షిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

జయహో.. భారత్

నెల్లూరు(బృందావనం): చంద్రయాన్ – 3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలకు నెల్లూరుకు చెందిన చిత్రకారుడు అమీర్‌జాన్ కళాత్మకంగా అభినందనలను బుధవారం తెలియజేశారు. 2 X 1.5 అడుగుల నిడివిలో కాన్వాస్‌పై చంద్రుడు, ప్రయోగ నమూనా విక్రమ్ ల్యాండర్, మువ్వన్నెల పతాకాన్ని చిత్రీకరించి జయహో భారత్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలను భారతీయ శాస్త్రవేత్తలు సొంతం చేసుకొని విశ్వగురువుగా నిలవాలని కాంక్షించారు.





చంద్రయాన్ - 3 ల్యాండింగ్‌పై జెడ్పీ కార్యాలయంలో విద్యార్థులకు అవగాహన

స్కై వాచర్ ద్వారా వీక్షణ



వీక్షిస్తున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): చంద్రయాన్ – 3 ల్యాండర్ జాబిల్లిపై అడుగుపెట్టిన తరుణంలో నగరంలోని జెడ్పీ కార్యాలయంలో స్కై వాచర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులు, విద్యార్థులు, తదితరులు చంద్రుడ్ని వీక్షించారు. దేశ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచిన ఇస్రో శాస్త్రవేత్తలకు జెడ్పీ చైర్‌పర్సన్ అభినందనలను తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రయోగాలు చేయాలని ఆమె కాంక్షించారు.

నేరాలు చేయాలంటేనే భయపడే పరిస్థితి



మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

- కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌తో దోషులకు శిక్ష
- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ (శిక్షల ఆధారిత పోలీసింగ్) ద్వారా దోషులకు శిక్ష పడుతోందని, దీంతో ఎవరైనా నేరాలు చేయాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటోందని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఏఎం హైస్కూల్ సమీపంలో గల పుట్ట దర్గా వద్ద గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడు ఖాజాపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదును కోర్టు విధించిన విషయం విదితమే. నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టిన చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్సై లతీఫున్నీసా, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రియాజ్‌ను నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం అభినందించిన ఎస్పీ వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తప్పు చేసిన ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోకుండా చేయడమే కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ముఖ్య ఉద్దేశమని, డీజీపీ ఆదేశాలతో ఈ విధానాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. హత్య, మహిళా సంబంధిత కేసులు, పోక్సో, తీవ్రమైన కేసుల్లో నిందితులు చట్టం నుంచి తప్పించుకోకుండా, వారికి వీలైనంత వేగంగా శిక్ష పడేలా చేస్తున్నామన్నారు. ప్రతి కేసునూ సవాల్‌గా తీసుకొని క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి ట్రయల్ ప్రక్రియను పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూస్తున్నామని వివరించారు. సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడటంతో బాధితులకు న్యాయం జరగడమే కాకుండా ఎవరైనా నేరాలు చేయాలంటేనే భయపడతారని పేర్కొన్నారు. దీని ద్వారా పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం కలుగుతోందని చెప్పారు. మిగిలిన కేసుల్లో సైతం ఇదే తరహాలో నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఎస్పీ హిమవతి తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ అభినందన

హత్య జరిగిన అనతి కాలంలోనే సమగ్ర దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టిన ఎస్పీ, నగర డీఎస్పీ, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కోర్టు కానిస్టేబుల్‌ను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలపండి



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ పార్టీలకు ఏమైనా అభ్యంతరాలుంటే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేపై జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని తన చాంబర్‌లో కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి జిల్లా యంత్రాంగం అనేక జాగ్రత్తలు తీసుకుంటోందని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారానికోసారి రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించి వారి సలహాలు, సూచనలు, సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నామని వివరించారు. చాలా ప్రాంతాల్లో బీఎల్‌ఓలు బాగా పనిచేస్తున్నారని, కొన్ని చోట్ల సమస్యలున్నాయని టీడీపీ ప్రతినిధులు తెలియజేశారు. ఇంటింటి సర్వేలో బూత్ లెవల్ అధికారులతో బూత్ లెవల్ ఏజెంట్లు ఉంటే ఏ విధమైన అభ్యంతరం లేదని కలెక్టర్ తెలిపారు. అనంతరం డీఆర్వో వెంకటనారాయణమ్మ మాట్లాడారు. ఇంటింటి సర్వే, ఓటర్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని, క్లెయిమ్‌లను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధి అనిల్‌కుమార్, టీడీపీ ప్రతినిధులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రూ.పది వేల జరిమానా

ఆత్మకూరు: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయిని భారీగా జరిమానాను బుధవారం విధించారు. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దర్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జడ్జి జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు గురవ్వడంతో పాటు ఇతరులను గాయాలకు గురిచేయడంతో పాటు నష్టపరుస్తున్నారని, మరోసారి ఇలా చేయకుండా భారీగా జరిమానా విధిస్తున్నామని తెలిపారు.

నవరత్నాలతో పేదలకు భరోసా

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మద్దతు వార్డు సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేద ప్రజలకు ఆర్థికంగా భరోసా లభించిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 2, 18వ వార్డుల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన రెండో వార్డు సభ్యురాలు రామిశెట్టి రాజేశ్వరి, ఆరో వార్డు సభ్యుడు పోట్ల ప్రసాద్‌, ఏడో వార్డు సభ్యురాలు పోట్ల రాధమ్మ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ మద్దతుదారైన రాజేశ్వరి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలై వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. మరో ఇద్దరు టీడీపీ మద్దతు వార్డు సభ్యులు చేరడం హర్షణీయమన్నారు. 2024లో కూడా మరోసారి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో 30 శాతం మంది మాత్రమే టీడీపీలో ఉన్నారని వారు కూడా మా పార్టీ నాయకులతో టచ్‌లో ఉన్నారన్నారు. ఈనెల 26వ తేదీన ఇందుకూరుపేట మండలంలో జరిగే కార్యక్రమంలో టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్‌ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్‌ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్‌ మోర్ల సుప్రజ, నాయకులు నరసింహారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శేషయ్య, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, అనూప్‌, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే రాష్ట్ర ప్రజలు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పైప్‌లైన్‌, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్‌: 'ఆరునెలల్లో తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. మళ్లీ మా ప్రభుత్వమే వస్తుంది.' అని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ నెల్లూరు రూరల్‌ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్‌ పరిధిలోని 31, 28 డివిజన్లలో పైప్‌లైన్‌, రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థలు బాగా పనిచేస్తున్నాయని కితాబిచ్చారు. 31వ డివిజన్‌లో రూ.8 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. ఇంకా రూ.1.10 కోట్లు మంజూరు చేస్తున్నామని, వాటితో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. 28వ డివిజన్‌లో రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలను మంజూరు చేశామని తెలిపారు. ఇంకా రూ.కోటి ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమమే కాకుండా అభివృద్ధి కూడా పరుగులు పెడుతోందన్నారు. సీఎం జగన్‌ నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు.

పాదయాత్ర ఆపితే వర్షాలు

చంద్రబాబు నాయుడు తన పర్యటనలు, లోకేశ్‌ పాదయాత్ర చేయడం ఆపితే వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆదాల అన్నారు. మంత్రి ఒకరు ఇదే విషయాన్ని మాట్లాడారని, తాను ఆయనతో ఏకీభవిస్తున్నానని వ్యాఖ్యానించారు. వారు యాత్రలు కొనసాగించి సకాలంలో వర్షాల పడక పోతే డ్యామ్‌లు ఒట్టిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్‌ రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారిపై లైంగికదాడి

- నిందితుడికి దేహశుద్ధి



నిందితుడు మస్తాన్‌వలీ

కందుకూరు: మనుమరాలి వయసుండే చిన్నారిపై ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి కందుకూరు పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కందుకూరు మండలం పలుకూరు గ్రామానికి చెందిన మస్తాన్‌వలీకి 55 సంవత్సరాలకు పైగా వయసు ఉంటుంది. స్కూల్‌, ప్రైవేట్‌ బస్సులకు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. కోటకట్టవీధిలో ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడి ఇంటికి ఎదురుగా ఐదేళ్ల చిన్నారి కుటుంబం నివాసం ఉంటోంది. చిన్నారి కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్తోంది. బుధవారం రాత్రి ఇంటికి వచ్చిన బాలికపై అతను లైంగికదాడికి పాల్పడ్డాడు. కాసేపటికి పాప పరిస్థితిని గమనించిన అమ్మమ్మ స్థానికంగా ఆర్‌ఎంపీ డాక్టర్‌ వద్దకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో అమ్మమ్మ, తల్లిదండ్రులకు అసలు విషయం తెలిసింది. బాలిక మస్తాన్‌వలీ ఇంటిని చూపించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు కామాంధుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై హనీఫ్‌ తెలిపారు.

కుక్కలు వెంటపడడంతో..

- బైక్‌ అదుపుతప్పి యువకుడి మృతి



ఆదిశేషయ్య మృతదేహం

కావలి రూరల్‌: ఓ యువకుడు మోటార్‌బైక్‌పై వెళ్తున్నాడు. ఈ సమయంలో ఒక్కసారిగా కుక్కలు వెంటపడ్డాయి. బైక్‌ అదుపుతప్పి వాటిని ఢీకొంది. కింద పడిన ఆ యువకుడు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి కావలిలో జరిగింది. రెండో పట్టణ ఎస్సై బాలకృష్ణ కథనం మేరకు.. కావలి రూరల్‌ మండలం కొత్తపల్లికి చెందిన మల్లికార్జున్‌, యశోద దంపతులకు ఆదిశేషయ్య (22) అనే కుమారుడున్నాడు. అతడిని కావలి పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన పెద్దనాన్న వెంకటేశ్వర్లు చిన్నతనంలోనే దత్తత తీసుకున్నాడు. ఆదిశేషయ్య పెద్దనాన్న వద్దే ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆరునెలల క్రితం రాజమహేంద్రవరానికి చెందిన సంధ్యతో అతడికి వివాహమైంది. మంగళవారం రాత్రి కొత్తపల్లిలోని తన తల్లి యశోదమ్మ వద్దకు ఆదిశేషయ్య బైక్‌పై బయలుదేరాడు. ఈ నేపథ్యంలో పీజీ కళాశాల వద్దకు వచ్చేసరికి కుక్కలు వెంటపడి బైక్‌కు అడ్డుగా వచ్చాయి. దీంతో బైక్‌ కుక్కలను ఢీకొని అదుపు తప్పింది. ఆదిశేషయ్య రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో కావలిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆదిశేషయ్య మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో రెండు కుటుంబాలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం ఏమి చేయలేదు. దీంతో ఆయన్ను నమ్మడం లేదు.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో బుధవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు తమ్ముళ్ల ప్రజా సొమ్మును దోచుకునేలా బాబు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పలేని స్థితిలో ఆయన ఉన్నారన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వాటిపై ప్రజల్లో చర్చ జరగకుండా ఉండేందుకు చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని అనేక సర్వేలు తేల్చి చెబుతున్నాయన్నారు. విలువలు మరిచి బూతులకు పరిమితమైన జనసేన అధ్యక్షుడు పవన్‌ కళ్యాణ్‌కు కనీసం ఒక్క సీటు కూడా రాదని సర్వేల్లో వెల్లడైందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని వంద శాతం నెరవేర్చడంతోపాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో నడిపిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటి ఊపును కొనసాగించడం, ఒక రకంగా అంతకంటే అప్పటి కంటే ఎక్కువగా సీట్లను గెలుచుకునే పరిస్థితులను సృష్టించుకోవడం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, పెనుమల్లి అశోక్‌, సురే మదన్‌మోహన్‌రెడ్డి, వింతా ప్రభాకర్‌రెడ్డి, శారద ఫణీంద్ర, కాటా శ్రీనివాసులురెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, ఈతముక్కల బాలమురళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వెంకయ్యస్వామి



సింహ వాహనంపై ఊరేగింపు

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి 41వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సింహ వాహనసేవ వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని సింహ వాహనంపై కొలువుదీర్చి పూలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ భజన బృందం చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు ఓం నారాయణ.. ఆదినారాయణ అంటూ భక్తిగీతాలను ఆలపించారు. ఈ సేవకు వేమూరు కిశోర్‌కుమార్‌, నాగ వెంకటఅరుణలత, వెంకటసాయి సాత్విక్‌ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కనులపండువగా గరుడ వాహనసేవ

రాత్రి గరుడ వాహనసేవ గొలగమూడి వీధుల్లో కనులపండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని వేలాదిమంది భక్తులు తిలకించారు. ఈ సేవకు నెల్లూరుకు చెందిన బీవీ లక్ష్మి, హేమంత్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్సవాలను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

నేడు ఆరాధనోత్సవం

ఆరాధనోత్సవాలు గురువారంతో ముగుస్తాయి. ఉదయం 9 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. 10 గంటలకు రథోత్సవం జరుగుతుంది. రాత్రి 8 గంటలకు కోనేరులో తెప్పోత్సవం కనులపండుగగా సాగనుంది. చివరిరోజు భక్తులు వేలాది సంఖ్యలో హాజరుకానుండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నారాయణా వారిని పరామర్శించావా?

- ప్రశ్నించిన సిటీ ఎమ్మెల్యే అనిల్‌



బుక్‌లెట్‌ అందజేస్తున్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌ కుమార్‌

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'నారాయణ కళాశాలల్లో ఎంతోమంది ఆడబిడ్డలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఏ రోజైనా బాధితుల ఇళ్లకు నారాయణ, ఆయన కుటుంబసభ్యులు వెళ్లి పరామర్శించారా?, కనీసం చివరిచూపైనా చూశారా?' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్‌ పి.అనిల్‌ కుమార్‌ ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని 9వ డివిజన్‌ పుల్లయ్య సత్రం మెయిన్‌ రోడ్డు, ఎఫ్‌సీఐ కాలనీ, ఎక్స్‌టెన్షన్‌, షిర్డీ సాయి నగర్‌ తదితర ప్రాంతాల్లో బుధవారం అనిల్‌ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో అభివృద్ధిపై చర్చకు రమ్మని తనపై పోటీకి నిలబడే వ్యక్తికి సవాల్‌ విసిరితే వివాదాల గురించి మాట్లాడనని చెబుతున్నారన్నారు. మొన్నటివరకు నేనే సిటీ అభ్యర్థినంటూ తిరిగిన వ్యక్తి మాత్రం స్పందిస్తుంటడం విడ్డూరంగా ఉందన్నారు. నారాయణ మంచివాడు కాదని ఆయన తల్లి చెప్పిన వీడియోను చూసి టీడీపీ నాయకులు మాట్లాడాలన్నారు. తనను అనవసరంగా విమర్శిస్తే మాత్రం ఆయన గురించి అన్ని విషయాలు మాట్లాడాల్సి వస్తుందన్నారు. 2019 ఎన్నికలకు ముందు తాను దొంగ ఓట్లు ఎక్కించానని మాట్లాడుతున్నారన్నారు. అయితే ఆ సమయంలో మంత్రిగా నారాయణ ఉన్నారని, విద్యాసంస్థల ద్వారా వేల ఓట్లు ఎక్కించగలిగే సమర్థత ఆయనకే ఉందన్నారు. అనుమానంతో పోలీసులు ఎవరినో తీసుకెళ్తే వారిపై దౌర్జన్యానికి వెళ్లి మీ సంగతి తేలుస్తానని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్ని జన్మలు ఎత్తినా టీడీపీ అధికారంలోకి రాదనే విషయం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ ఎండీ ఖలీల్‌ అహ్మద్‌, స్థానిక డివిజన్‌ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని.. పారిపోయే యత్నం

- టిప్పర్‌ డ్రైవర్‌ నిర్వాకంతో లారీ డ్రైవర్‌ మృతి


గుడ్లూరు: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ టిప్పర్‌ డ్రైవర్‌ పారిపోయే క్రమంలో లారీ డ్రైవర్‌పై వాహనాన్ని ఎక్కించాడు. మండలంలోని 16వ నంబర్‌ జాతీయ రహదారిపై శాంతినగర్‌ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌ నుంచి చెన్నైకు ఫ్లై ఉడ్‌ లోడుతో ఐషర్‌ లారీ బయలుదేరింది. శాంతినగర్‌ వద్దకు వచ్చేసరికి చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు రాళ్ల లోడుతో టిప్పర్‌ వేగంగా వెళ్తూ అదుపుతప్పి ఐషర్‌ లారీని వెనుక వైపు ఢీకొంది. దీంతో లారీ రోడ్డు పక్కన తిరగబడి లోపలున్న డ్రైవర్‌ శ్రీనివాసరావు (54) కింద పడ్డాడు. టిప్పర్‌ డ్రైవర్‌ అక్కడి నుంచి పారిపోయే ఆలోచనతో వాహనాన్ని ముందుకు పోనిచ్చే క్రమంలో శ్రీనివాసరావు మీద ఎక్కించడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. టిప్పర్‌ రహదారి పక్కన ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో దాని డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరావుది హైదరాబాద్‌ అని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేఖా రచన పోటీలు

నెల్లూరు(మినీబైపాస్‌): తపాలా శాఖ జాతీయ స్థాయిలో లేఖా రచన (ధాయి ఆఖర్‌) పోటీలు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోస్టాఫీసెస్‌ ఎస్‌.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్‌ ఇండియా ఫర్‌ న్యూ ఇండియా అంశంపై లేఖలను తెలుగు, ఇంగ్లిష్‌, హిందీ భాషల్లో రాయొచ్చని తెలియజేశారు. చివరి తేదీ అక్టోబర్‌ 31 అని వెల్లడించారు. 18 సంవత్సరాల వయసు లోపు, 18 సంవత్సరాల పైన కేటగిరీలుంటాయన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని తెలిపారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7



సాక్షి ఫ్యామిలీ IV
నెల్లూరు
గురువారం 24-8-2023



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు'
చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు.
మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.
అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా.
'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు.
ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు.
'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు.'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



● మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తియదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమైన ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు చైర్ ఉమన్ (చైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్లు పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంకాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయుల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ.
సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది.
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



● సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హఠాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అందంగా పెంచుకుందాం!

బ్యూటిప్స్





గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

● డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి. ● వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఎఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు. ● వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి. ● లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్